# కాశ్మీరీలను విడిచి కాశ్మీర్ పరిష్కారమా?

**నెహ్రూ బ్రాండు లౌకికవాదులకు కాశ్మీర్ ఆధునిక భారతలౌకికతకు ప్రతీక. అద్వానీ బ్రాండు దేశభక్తులకు కాశ్మీర్ అఖండ భారత్‌కు ప్రతీక. పాకిస్తానీ పాలకులకు అనంతమైన జిహాద్ కు ప్రతీక. కాశ్మీర్ గురించి ఆలోచించడమంటే కాశ్మీరీల కోసం ఆలోచించడమని మనమెప్పుడు అర్థం చేసుకుంటాం?**



కె. బాలగోపాల్

కాశ్మీర్ విషయంలో యాభై ఏళ్ళకిందట జరిగిన ఘోరమైన పొరబాటు మళ్ళీ జరగబోతున్నదా? కాశ్మీరీల మనోభావాలను పట్టించుకోకపోవడం గొప్ప రాజనీతి అనే అభిప్రాయం ఈ దేశంలో ఇంత బలంగా స్థిరపడడం చాలా ఆశ్చర్యం కలిగించే విషయం. యాభై ఏళ్ళ చరిత్ర నుంచి ఏగుణపాఠమూ తీసుకోనక్కరలేదన్నట్టు వెంకయ్యానాయుళ్ళూ, జానాకృష్ణమూర్తులూ మాట్లాడడం ఆశ్చర్యమే కాదు. ఆగ్రహం కూడా కలిగించే విషయం. తాము తెలివి తక్కువగా ఉండదలచుకుంటే అది వారి సొంతవిషయమే కావచ్చును గానీ దానిని దేశం మీదరుద్దే అధికారం వారికెవరిచ్చారు?

ఫారూఖ్ అబ్దుల్లా 1953 పూర్వపు స్థితిని తిరిగి తీసుకురావాలని పట్టుబట్టడంలో గల నిజాయితీ ఎంత అన్నది ఇక్కడ ప్రశ్నకాదు. భారతప్రభుత్వం కాశ్మీర్ సమస్య పరిష్కారం కోసం హురియత్ కాన్ఫరెన్స్‌తో చర్చలు మొదలు పెడితే తన ఉనికికే ప్రమాదం వస్తుందని భయపడి ఈ ఎత్తుగడ ఫారూఖ్ అబ్దుల్లా వేశాడని కొందరంటున్నారు. కావచ్చు. రాజకీయవేత్తగా ఫారూఖ్ అబ్దుల్లా సగటు భారతీయ రాజకీయనాయకులకన్నా గొప్పవాడు కాడు. అయినప్పటికీ, ఆ రాష్ట్ర స్వయంప్రతిపత్తిని పునరుద్ధరించే విషయమై పరిశీలన జరిపి నివేదిక రూపొందించడానికొక కమిటీని అతడు అధికారానికి వచ్చీరాగానే నియమించాడని మరచిపోకూడదు. అప్పటికి హురియత్ కాన్ఫరెన్స్‌తో భారత ప్రభుత్వం చర్చలు జరపబోతోందన్న ప్రతిపాదన సహితం లేదు.

ఆ మాటకొస్తే చర్చల విషయంలో భారతప్రభుత్వం నిజాయితీ గానీ హురియత్ కాన్ఫరెన్స్ నిజాయితీ గానీ ఎంత? ఒకరంటే ఒకరికి ఏమాత్రం గౌరవం లేని ఈ ఇద్దరూ కేవలం అమెరికా ఒత్తిడివల్ల చర్చలకు అయిష్టంగా సిద్ధపడుతున్నారనేది అందరికీ తెలిసిన సంగతే. భారత పాలకుల అభిప్రాయంలో హురియత్ కాన్ఫరెన్స్ నాయకులు పాకిస్తాన్ ఏజెంట్లు. 'మీకిక్కడేం పని? పాకిస్తాన్‌కు పొండి' అని కాశ్మీర్‌ను ఏలుతున్న సైనికాధినేతలు అనేక పర్యాయాలు హురియత్ నాయకులను ఎద్దేవా చేశారు. కార్గిల్ యుద్ధ మప్పుడు హురియత్ నాయకులు 'చొరబాటుదారులను' 'విముక్తి కారులు'గా పేర్కొంటూ వారికి ఆహ్వానం పలుకుతూ శ్రీనగర్‌లో ఊరేగింపులు తీయడం భారత పాలకులకు మరీ కోపం తెప్పించింది. యుద్ధమయిపోయిన కొద్దికాలానికే, అప్పటి దాకా స్వేచ్ఛగా ఉండిన హురియత్ కాన్ఫరెన్స్ నాయకులందరినీ ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాలకింద అరెస్టు చేశారు. కేంద్రం కూడా ఈ విషయంలో రాష్ట్రానికి సహకరించింది కాబట్టే హురియత్ నాయకులు కాశ్మీర్ జైళ్ళలో ఉంటే వారిని చూడడానికి వచ్చేవారితో పోయేవారితో జైళ్ళు మరీ కోలాహలంగా ఉంటాయని చెప్పి వారిని ఆ రాష్ట్రానికి వెలుపల బంధించారు. పనిలోపనిగా ఆ హిమాలయవాసులను రాజస్థాన్ ఎడారిలోని జోద్‌పూర్ సెంట్రల్ జైలులో నిర్బంధించి తమ శాడిజం కూడా ప్రదర్శించుకున్నారు.


వాళ్ళిప్పట్లో బయటికి రారనుకుంటూ ఉండగా దేశానికి బిల్ క్లింటన్ వచ్చి వెళ్ళాడు. అతను వెళ్ళిపోయిన కొద్ది రోజులకే హురియత్ నాయకులందరినీ ఏకారణం చెప్పకుండా విడిచిపెట్టారు. వాళ్ళ వల్ల జాతి భద్రతకు ఉందని చెప్పిన ప్రమాదం ఏమయి పోయిందో చెప్పలేదు. పైగా అక్కడితో ఆగకుండా ఈ దేశద్రోహులతో, పాకిస్తాన్ మానసపుత్రులతో చర్చలకు సహితం ప్రభుత్వం సిద్ధమేనని అద్వానీ వంటి దేశ భక్తుడు ప్రకటించారు. పలికెడిది అద్వానీయే గానీ పలికించెడు వాడుక్లింటన్ అనేది అందరూ ఎరిగిన విషయమే. దీనితో పోలిస్తే ఫారూఖ్ అబ్దుల్లా అవకాశవాదం ఏమంత నిందించవలసింది కాదు.

హురియత్ కాన్ఫరెన్స్ విషయం కూడా అంతే. 30 కి పైగా సంస్థలు ఆ కూటమిలో ఉన్నాయంటారు కానీ దానిని నడిపించేదీ పలికించేదీ జమాతె ఇస్లామి యే. జమాతే నాయకుడు సయ్యద్ అలీషా గిలానీ అభిప్రాయాలే హురియత్ అభిప్రాయాలు. జమాతే ఇస్లామితో మౌలిక విభేదాలున్న యాసిన్ మాలిక్ వంటి వారు సహితం కాశ్మీరీ పోరాటం గొంతు ఒకటిగా ఉండాలన్న ఆకాంక్ష వల్ల భిన్నమైన గొంతులతో మాట్లాడారు.

మరి జమాతే ఇస్లామి అభిప్రాయంలో చర్చలంటే త్రైపాక్షిక చర్చలే. భారత్, పాకిస్తాన్‌లు, కాశ్మీరీ ప్రతినిధులు కూర్చొని మాట్లాడుకోవాలే తప్ప కాశ్మీరీలూ భారత ప్రభుత్వమూ మాట్లాడుకోవడం వృథా అనేది వారి అభిప్రాయం. అదే హురియత్ కాన్ఫరెన్స్ అభిప్రాయం కూడా. అయినప్పటికీ అమెరికా ఒత్తిడి ఫలితంగా వారిప్పుడు భారత ప్రభుత్వంతో ద్వైపాక్షిక చర్చలకు అయిష్టంగా నయినా సిద్ధపడుతున్నారు. ఇప్పుడు ప్రపంచంలో అమెరికాయే ఏకైక న్యాయనిర్ణేత, ఏకైక న్యాయస్థానం. ఈ సత్యానికి అయిష్టంగా తలఒగ్గి పంచాయతీకి కూర్చోవడానికి సిద్ధపడుతున్న భారత పాలకులతో, హురియత్ కాన్ఫరెన్స్‌తో పోలిస్తే ఫారూఖ్ అబ్దుల్లా అందరూ అంటున్నంతటి నీతి మాలిన అవకాశవాది కాదు.

దీని అర్థం భారతప్రభుత్వం హురియత్ కాన్ఫరెన్స్‌తో మాట్లాడవద్దని కాదు. అమెరికా చెప్పేదాకా జ్ఞానోదయంకాలేదు. అప్పుడు కూడా అమెరికా చెప్పిందన్న తప్పుడు కారణం వల్ల జ్ఞానోదయం కలిగిందన్న అభ్యంతరం తప్ప' చర్చల పట్ల అభ్యంతరమేమీలేదు, ఉండనవసరం లేదు. హురియత్ కాన్ఫరెన్స్ కాశ్మీర్‌లోని ప్రధాన మిలిటెంట్ శక్తుల రాజకీయ ప్రతినిధి. అటువంటి వారితో రాజకీయ సంవాదం పెట్టుకోవడానికి ఒకరి సలహా ఎందుకు? వారితో మాట్లాడకుండానే 'కాశ్మీర్ సమస్య' పరిష్కార మై పోతుందని ఎందుకు అనుకుంటూ వచ్చారు? ఏవిధంగా అనుకోగలిగారు? హురియత్ కాన్ఫరెన్స్ ప్రధాన నాయకులు పాకిస్తాన్ అనుకూలురే కావచ్చు. కాశ్మీర్ ప్రజలలోనే పాకిస్తాన్‌లో కలవాలన్న ఆకాంక్ష ఒక చెప్పుకోదగ్గ వర్గంలో ఉన్నప్పుడు వారితో మాట్లాడకుండానే ఉండడం ఎట్లా సాధ్యమవుతుంది? ఎంత అప్రియమైన అభిప్రాయాన్నయినా కేవలం తుపాకులతో ఎట్లా ఎదుర్కొంటారు?

కాగా, ఇప్పుడు అమెరికా ఒత్తిడి ఫలితంగా చర్చలకు కూర్చోవడం వల్ల హురియత్ కాన్ఫరెన్స్ కాశ్మీర్ ప్రజల ఏకైక ప్రతినిధి అయిపోయే ప్రమాదం ఉంది. అది నిజమూ కాదు, అట్లా అనుకోవడం వాంఛనీయమూ కాదు. నిజానికి అమెరికా ఒత్తిడి అనే అండ దొరకక ముందు హురియత్ కాన్ఫరెన్స్ నాయకులు ఈ విషయంలో నిజాయితీగానే మాట్లాడేవారు. కాశ్మీర్ ప్రతినిధులంటే తాము మాత్రమే కాదనీ కాశ్మీర్‌లోని భిన్న ఆలోచనా ధోరణులన్నిటికీ చర్చలలో చోటు ఉండాలనీ అనేవారు. ఇప్పుడు ప్రపంచ పోలీసు అండ దొరికాక ఆ వినయం ప్రదర్శించవలసిన అవసరం లేదని వారు కూడా అనుకోవచ్చు.



1953 నాటి స్థితి మాటకొస్తే కాశ్మీర్ ఎప్పటికయినా భారతదేశంలో ఉండాలంటే ఆ స్థితిని పునరుద్ధరించడం తప్పవేరే మార్గం లేదు. ఇది ఫారూఖ్ అబ్దుల్లా నిజాయితీతో గానీ రాజకీయ విజ్ఞతతోగానీ నిమిత్తం లేని వాస్తవం. కాశ్మీర్ గురించి ఏ కొంచెమైనా తెలిసిన వారందరికీ ఈ సంగతి తెలుసును. 'జబ్‌తక్ సూరజ్‌చాంద్ రహేగా కాశ్మీర్ హిందుస్తాన్ రహేగా' అంటూ నినాదాలు ఇచ్చేవాళ్ళు మాత్రం దీనిని గుర్తించదలచుకోలేదు. వాళ్ళు నమ్ముకున్నది, ఆరాధించేది బలాన్ని, బల ప్రయోగాన్ని. కావలసినన్ని తుపాకులు, క్షిపణులు, అణుబాంబులు సమకూర్చుకుంటే కాశ్మీర్ ఇండియాలో ఉండక చస్తుందా అన్నది వాళ్ళధీమా. వాళ్ళ మాటే సాగితే మాత్రం కాశ్మీర్ ఏదో ఒక రోజు భారత్ నుండి వేరయి పోక తప్పదు. ఎట్టి పరిస్థితులలోనూ జరగనివ్వం అంటూ ఏ 1953 పూర్వస్థితి పునరుద్ధరణ గురించి ఈ హిందూత్వవాద నాయకులంతా ఆలోచన లోపించిన ఆత్మవిశ్వాసంతో ప్రకటనలిస్తున్నారో ఆ 1953 స్థితినితిరిగి తీసుకొస్తేనే కాశ్మీర్ ఇండియాలో కొనసాగే అవకాశం కొంతయినా ఉంది.

'స్వయం ప్రతిపత్తిని ఎట్టి పరిస్థితిలోనూ పునరుద్ధరించం. పాకిస్తాన్ ఆక్రమణలోని కాశ్మీర్‌ను కూడ విముక్తం చేసి మొత్తం కాశ్మీర్‌ను భారత భూభాగంగా ఏలుతాం' అని హోంమంత్రి అంటున్నారు. ఆర్ఎస్ఎస్ శాఖలలో ఉపన్యాసాలిచ్చిచప్పట్లు కొట్టించుకున్నట్టు కాదు దేశ విధాన రచన చేయడమంటే. కేవలం 45 లక్షల జనాభా ఉన్న కాశ్మీర్‌లోయ పదేళ్ళకాలంలో దాదాపు 70వేల మందిని పోగొట్టుకుని కూడా స్వాతంత్ర్యం స్వయంప్రతిపత్తి స్వేచ్ఛ అనే మాటలకు స్పందిస్తున్నదంటే దాని వెనుక చాలా లోతయిన ఆకాంక్ష ఉందని అర్థం కాని వాళ్ళకు దేశాన్ని పరిపాలించే అర్హతగానీ యోగ్యత గానీ ఉందనుకోవాలా?

కొండప్రాంతాలలో బతికే వాళ్ళలో అమాయకత్వం పాలు కొంచెం ఎక్కువ ఉంటుందంటారు. కాశ్మీర్ అనగానే ఈ రోజు మతోన్మాదం, హింస స్ఫురించే వాతావరణం నెలకొనిందిగానీ సగటు కాశ్మీరీలలో ఇవేవీ కనిపించవు. 'మేము వేరు, మా బతుకు వేరు. మమ్మల్ని మా పాటికి ఉండనివ్వండి అంటే మీకెందుకు అర్థం కాదు?' అని స్నేహంగానే విస్మయం వ్యక్తం చేస్తారు. వాళ్ళ భావాలతో నిమిత్తం లేని వేరే ఏవేవో విషయాలకు కాశ్మీర్ ప్రతీక అయి పోవడం వల్ల ఈప్రశ్న ఎవరికి వినిపించదు. నెహ్రూ బ్రాండు లౌకికవాదులకు కాశ్మీర్ ఆధునిక భారతలౌకికతకు ప్రతీక. అద్వానీ బ్రాండు దేశభక్తులకు కాశ్మీర్ అఖండ భారత్‌కు ప్రతీక. పాకిస్తానీ పాలకులకు అనంతమైన జిహాద్ కు ప్రతీక.

కాశ్మీర్ గురించి ఆలోచించడమంటే కాశ్మీరీల కోసం ఆలోచించడమని మనమెప్పుడు అర్థం చేసుకుంటాం?